ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
బుధవారం | 25 ఫిబ్రవరి , 2026 | పేజీలు :08

## అధికార దాహంతో కాంగ్రెస్ అరాచకాలు



వివరాలు మెయిన్‌లో...

## ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- అభివృద్ధిలో దేశం మెచ్చే స్థాయిలో తెలంగాణ
- పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు



ప్రజాపక్షం/సుల్తానాబాద్:సుల్తానాబాద్ మండల కేంద్రంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్ లో మంగళ వారం సుల్తానాబాద్ మున్సిపల్ తో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 99 మంది లబ్ధిదారులకు 99,11,484 / (తొంబై తొమ్మిది లక్షల పదకొండు వేల నాలుగువందల ఎనబై నాలుగు రూపాయలు) విలువ గల కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పెద్దపల్లి శాసనసభ్యులు చింత కుంట విజయరమణా రావు స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు పోతుందని గత పాలకులు తొమ్మిది సంవత్సరాల కాలంలో ఏ ఒక్కరికి రేషన్ కార్డు అందించిన పాపాన పోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రి శ్రీధర్ బాబు సారధ్యంలో 333 రేషన్ కార్డులను అందించామని 824 కుటుంబాలకు లబ్ధి చేకూరిందని నూతనంగా నమోదైన వారు 34 52 కుటుంబాలు కాగా 47 64 నమోదయాయని తెలిపారు. మండలంలో కొత్తగా రేషన్ కార్డులు 22 152 అందించామన్నారు. పూర్తిగా కుటుంబ సభ్యుల సంఖ్య 63 836 ఉన్నారని తెలిపారు. మండలంలో ప్రతినెల 357 856 క్వింటాల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో హామీ ఇచ్చిన ప్రతి ఒక్క పథకాన్ని అమలు చేస్తామని అర్హులైన వారందరికీ పింఛన్లు అందిస్తూ ప్రతి పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు. బి.ఆర్.ఎస్ ప్రభుత్వం 9 సంవత్సరాలు అధికారంలో ఉండి సుల్తానాబాద్ మండలాన్ని భ్రష్టు పట్టించిందని ఇక్కడ ఉన్న ప్రతి కార్యాలయాన్ని తరలించి ఈ ప్రాంతాన్ని ఎడారిగా మార్చిన చరిత్ర గత పాలకులదని అన్నారు. . అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్విరామంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందని దానికి నిదర్శనమే గ్రామాలలో జరిగిన ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి 70% సర్పంచ్ అభ్యర్థులు ఘనవిజయం అందించారని హైదరాబాదు లో జూబ్లీహిల్స్ ఎన్నికలలో కాంగ్రెస్ 26 వేల ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించింది అన్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపల్ లో 80% కాంగ్రెస్ అభ్యర్థులే విజయకేతనం ఎగురవేశారన్నారు. సంక్షేమ పథకాలలో ముందున్నామని మహిళలకు ఫ్రీ బస్సు, రైతులకు సన్న వడ్లకు బోనసు, రైతు బీమా, రైతు భరోసా అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు తోపాటు ఇలా అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చే పట్టి ముందుకు పోతున్నామని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి పథంలో పయనించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ లో 21 కోట్లతో సిసి రోడ్ల నిర్మాణం త్వరలోనే చేపడతామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలం అయ్యే విధంగా పాలన కొనసాగుతుందని రైతులకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్ పాలనలో సుభిక్షంగా ఉన్నారని పేర్కొన్నా రు. గత పాలకులను విస్మరించి కాంగ్రెస్ ను ఆదరిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, , తాసిల్దార్ బషీరుద్దీన్,కాంగ్రెస్ నాయకులు వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు,మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు లబ్ధిదారులు పలువురు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్‌పై దృష్టి

పట్టణ ప్రాంతాలలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులపై సంబంధిత అధికారుల తో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ము న్సిపల్ ఎన్నికల కోడ్ ముగిసినందున పట్టణాలలో నూతనం గా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పై అధికారులు దృష్టి సారించాలని ప్రతి వార్డు పరిధిలో ప్రత్యేకంగా స మావేశాలు నిర్వహిస్తూ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం అ య్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

వివరాలు మెయిన్‌లో...



## గోదావరి పరిశుభ్రత అందరి బాధ్యత



జీవనది గోదావరి పరిశుభ్రత కో సం పార్టీలు,జెండాలకతీతంగా స్థానికంగా ఉన్న అన్నివర్గాల ప్రజలూ భాగస్వామ్యులు కావాలని,నదీ పవిత్రత ను కాపాడటం అందరి బాధ్యతగా భావించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమా ర్ అన్నారు.జగిత్యాల జిల్లా ధర్మపురి పురపాలక సంఘం నూతన పాలకవర్గం ఇటీవలే కొలువుదీరగా వారి ఆధ్వర్యంలో గోదావరి నది స్వచ్ఛతకై మంగళవారం ప్రారంభించిన స్వచ్ఛ ధర్మపురి-స్వచ్ఛ గోదావరి పారిశుద్ధ్య కా ర్యక్రమానికి మంత్రి అడ్లూరి హాజరయ్యారు.

వివరాలు మెయిన్‌లో...

## పకడ్బందీగా పదవ తరగతి పరీక్షల నిర్వహణ

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

అశ్వినీ తానాజీ వాకడే




ప్రజాపక్షం/కరీంనగర్:మార్చి 14 నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే చీఫ్ సూపరిండెంట్లను ఆదేశించారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కరీంనగర్ లోని కలెక్టరేట్ ఆడిటోరియంలో పదవ తరగతి పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరిండెంట్లు. డిపార్ట్మెంట్ ఆఫీసర్లు ఫ్లయింగ్ స్క్వాడ్స్, వాహనాల ఇన్చార్జిలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో 73 రెగ్యులర్, 1 ప్రైవేటు పరీక్ష కేంద్రాల్లో పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయని పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఫ్యాన్లు తాగునీటి వసతి కల్పించడంతోపాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మాస్ కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా చాలా పకడ్బందీగా కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా ప్రత్యేక కృషి చేయాలన్నారు. నిబంధనలు ఎక్కడా అతిక్రమించవద్దని నిబంధనల ప్రకారం పరీక్షలు సజావుగా సాగేలా అందరు సహకరించాలని పేర్కొన్నారు. జిల్లాలో దాదాపు 650 మంది ఇన్విజిలేటర్లు పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్నారని తెలిపారు. విద్యార్థులు సమయానికంటే ముందుగానే పరీక్ష కేంద్రాలకు వచ్చేలా వాహన సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో ప్రశాంతమైన వాతావరణం లో పదో తరగతి పరీక్షలు విజయవంతంగా ముగిసేలా సమిష్టిగా అందరం కలిసి కృషి చేద్దామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఎస్ఎస్సి పరీక్షల నిర్వహణపై నియమాలు నిబంధనలు పాటించాల్సిన జాగ్రత్తలు ఇతర అంశాలపై పూర్తిస్థాయిలో మాస్టర్ ట్రైనర్లు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడి మాధవి ఏసీజీఈ సంధ్యారాణి, డిసిఈబి కార్యదర్శి భగవంతయ్య, కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, శ్రీనివాసు కృపారాణి, ఆంజనేయులు అధికారులు పాల్గొన్నారు.

## లక్ష్మీదేవిపల్లిలో గుర్తు తెలియని వ్యక్తుల చోరీ

**ప్రజాపక్షం/గంగాధర:**గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. గ్రామంలోని సుదిరెడ్డి దర్మారెడ్డి ఇంటిలో ఆదివారం నుంచి సోమవారరం సాయంత్రం 6 గంటల మధ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దొంగలు తాళం పగలగొట్టి ఇంట్లో చొరబడి దేవుని రూంలోని 4 గ్రాముల గ్రాముల బంగారు సత్యనారాయణ విగ్రహం, 3 తులాల బరువు గల 2 వెండి గ్లాసులు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బెందరం సద్గుణ ఫిర్యాదు చేసినట్లు గంగాధర ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి సంఘటన స్థలంలో క్లూస్ టీం సహాయంతో వేలిముద్రలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లు పట్టివేత

**ప్రజాపక్షం/కొత్తపల్లి:**పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు వారి ట్రాక్టర్లలో మానేరు వాగు నుంచి ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తూ కరీంనగర్ వైపు వస్తుండగా ముగ్దుంపూరు గ్రామం వద్ద విజిలెన్స్ అధికారులు పట్టుకుని కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో సిఐ నిరంజన్‌రెడ్డి ట్రాక్టర్లను స్వాధీన పరుచుకుని 5గురు డ్రైవర్లపై కేసు నమోదు చేసు చేశారు. గత కొద్ది రోజుల నుంచి గొల్లపల్లి మానేరు వాగు నుంచి చాలా మంది అక్రమంగా రవాణా చేస్తూ పలు సందర్భాల్లో కేసులు నమోదై రెండోసారి దొరికితే తహసీల్దార్ వద్ద లక్ష రూపాయాల వరకు ఫైన్ వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణా, దళారులపై అవసరమైతే పిడి యాక్టులు నమోదు చేసి జైలుకు పంపుతామని సిఐ నిరంజన్ రెడ్డి హెచ్చరంచారు.

## నూతన కౌన్సిలర్లకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** ఇటీవల జరిగిన సుల్తానాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ నూతన కౌన్సిలర్లు 1 వ వార్డు ఈర్ల స్వరూప శేఖర్, 5 వ వార్డు కౌన్సిలర్ గరిగే శోభారాణి శ్రీనివాస్, 12 వ వార్డు కౌన్సిలర్ అమీరిశెట్టి శ్రావణి రాకేష్, 15 వ వార్డు కౌన్సిలర్ గాదాసు మంజుల రవి లను సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లో చదువుకున్న 198687 యస్ యస్ సి బ్యాచ్ మిత్రులు ఘనంగా శాలువాలతో సత్కరించీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సాధుల కరుణాకర్, సామల రాజేంద్ర ప్రసాద్,బండారి శ్రీనివాస్,ఇప్పకాయల భూమయ్య, కామని వెంకటేశం,ఎర్రోజు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సంతోష్ రావు,మాజీ వార్డు సభ్యులు అమిరిశెట్టి తిరుపతి, పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఇంటర్, పదో తరగతి పరీక్షలు నిర్వహించాలి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల నిర్వహణ ఇతర అంశాలపై హైదరాబాద్ నుంచి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, విద్యాశాఖ ఉన్నతాధికారులతో కలిసి, అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ.. ఎస్ ఎస్ సీ, ఇంటర్ పరీక్షలను ప్రశాంతంగా పూర్తి చేయాలన్నారు. పరీక్షల నిర్వహణపై పలు అంశాలను చర్చించారు. పరీక్షల నిర్వహణపై వివరాలను జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాలకు పరీక్షా పత్రాల తరలింపు సమయంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాలలో తాగు నీరు, సౌకర్యవంతమైన బెంచీలు, సరైన లైటింగ్, సిబ్బందితో కూడిన వైద్య శిబిరం, తదితర అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా, పరీక్షల సమయాలకు అనుగుణంగా బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షలు జరుగుతున్నతసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వివరించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ దుకాణాలు మూసివేసి, బిఎన్ఎస్ సెక్షన్ 163 (సీఆర్పీసీ 144) అమలు చేయాలని అన్నారు. ఇంటర్మీడియట్ కు సంబంధించి రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో మొత్తం రేపటి (బుధవారం) నుంచి మార్చి 16వ తేదీ 4046 వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు, 4060 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం కలిపి 8106 విద్యార్థులు 16 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి మార్చి14వ తేదీ నుంచి ఏప్రిల్ 16 వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి, 12.30 వరకు, జిల్లాలోని 34 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 7,317మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఈవో జగన్ మోహన్ రెడ్డి, డీఐఈఓ శరత్ కుమార్, డీపీవో షరీఫుద్దిన్, డీటీఓలు లక్ష్మ ణ్, నవీన్ కుమార్, డీఎంహెచ్ఓ రజిత, టీజీ ఈడబ్ల్యూఐడీసీ అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రావణ్, వేణు, ఆర్టీసీ, సెస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 22వ డివిజన్‌లో చెత్త సేకరణకు నూతన ట్రాక్టర్ కేటాయింపు



**ప్రజాపక్షం/కరీంనగర్:**కరీంనగర్ నగరపాలక సంస్థ 22వ డివిజన్ లో చెత్త సేకరణ నిమిత్తం నూతన ట్రాక్టర్ ను కేటాయించారు. ట్రాక్టర్ కు మంగళవారం మేయర్ కోలగాని శ్రీనివాస్ కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగని శ్రీనివాస్ మాట్లాడుతూ డివిజన్లో చెత్త సేకరణకు అవసరమైన వాహనాల విషయంలో ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. వాహన కొరత ఉందని స్థానిక కార్పొరేటర్ బండ రమణా రెడ్డి తమ దృష్టికి తీసుకురాగానే నూతన ట్రాక్టర్ ను డివిజన్ కు కేటాయించడం జరిగిందన్నారు. డివిజన్ లో పారిశుద్ధ్య పనులు, చెత్త సేకరణ కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా చూస్తామన్నారు. డివిజన్ అవసరాల కోసం అడగగానే నూతన ట్రాక్టర్ కేటాయించిన మేయర్ కోలగని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ లకు కార్పొరేటర్ రమణారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బోయిన్పల్లి ప్రవీణ్ రావు, వాసాల రమేష్, గుగ్గిల్లపు రమేష్ , వంగల పవన్ ,పెద్దపల్లి జితేందర్‌జితేందర్, మొండన్న, ఎన్నం ప్రకాష్, వేముల చంద్రశేఖర్, వెంకటేష్ లతోపాటు బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిపాల్గొన్నారు.

## డ్రైవర్లందరికీ ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాపక్షం/కరీంనగర్ :**తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు భద్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా, కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో వాహన డ్రైవర్లందరికీ భారీ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందనిసిపిగౌష్ ఆలం తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల కంటి చూపు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుంది. దృష్టి లోపం వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టడానికి మరియు డ్రైవర్ల ఆరోగ్య సంరక్షణ కోసం ఈ ఉచిత పరీక్షల శిబిరాన్ని నిర్వహిస్తున్నామని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబందించిన పోస్టర్ ను మంగళవారంనాడు సీపీ, పోలీసు కమీషనర్ కార్యాలయంలో ఇతర పోలీసు అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఈ సందర్భంగా మాట్లాడుతూ, డ్రైవర్ల భద్రతకు తమ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అరైవ్ అలైవ్" చొరవతో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీస్ యంత్రాంగం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. సురక్షిత ప్రయాణానికి స్పష్టమైన కంటి చూపు చాలా ముఖ్యం. ప్రైవేట్ వాహనాలు, టిజిఆర్టిసి , ఆటోలు, భారీ వాహనాల డ్రైవర్లందరూ ఈ ఉచిత వైద్య సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నామన్నారు. డ్రైవర్లందరికీ ఉచిత కంటి వైద్య శిబిరం ఫిబ్రవరి 27న అస్త్ర కన్వెన్షన్ హాల్, కరీంనగర్ పోలీసు హెడ్ క్వార్టర్స్ లో నిర్వహిస్తున్నట్లు సీపీ తెలిపారు. కరీంనగర్ , పరిసర ప్రాంతాల్లోని డ్రైవర్లందరూ ఫిబ్రవరి 27న అస్త్ర కన్వెన్షన్ హాల్‌కు చేరుకుని, నిపుణులైన వైద్యులచే కంటి పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, ఏసీపీ లు వెంకటస్వామి, విజయకుమార్, జి.రమేష్, సతీష్, రమేష్, ఇన్స్పెక్టర్లు తిరుమల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 43 డివిజన్లలో వెంటనే రీ పోలింగ్ జరిపించాలి

### రామగుండం మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరు కంటి చందర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ఇటీవల రామగుండంలో్ జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే మక్కాన్సింగ్ అవినీతి ఆరోపణలకు పాల్పడి 43 డివిజన్ లలో బిఆర్ఎస్ నాయకులను బెదిరించి కాంగ్రెస్ నాయకులను గెలిపించుకున్నాడని మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ ఆరోపించారు. మంగళవారం రోజున పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు రామగుండం కార్పొరేషన్ ఎన్నికలపై ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 43 డివిజన్ లలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు యదేచ్ఛగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, స్ట్రాంగ్ రూమ్ వద్ద కరెంటు తీసివేసిన సమయంలో ఓట్ల మార్పిడికి పాల్పడ్డారని ఆరోపించారు. బ్యాలెట్స్ బాక్స్ ఓపెన్ చేస్తే దాదాపు ఓట్లు అన్ని ఓట్లు కాంగ్రెస్‌కే పడ్డాయని, కానీ డివిజన్లో వారీగా ప్రజలు తా ము బి ఆర్ఎస్ కే ఓటు వేశామని తెలిపారని, దీన్నిబట్టి ఎ మ్మెల్యే తన పదవీ బలంతో బ్యాలెట్ బాక్స్ లు తారుమారు చేశారని, తమకు ఈ విషయమై అనుమానం ఉందని,ఈ వి షయంపై ,అధికార పార్టీకి తొత్తులుగా పనిచేసిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు.ఈ విషయమై జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోకపోతే త్వరలోనే రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపా రు.43 డివిజన్ లలో రీ పోలింగ్ జరపాలని డిమాండ్ చే శారు.బిఆర్ఎస్ నాయకులు నారాయణదాసు మారుతి, పె ద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టిఐ క్యాంపెయిన్ క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ క్యాంపెయిన్ తెలంగాణ 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ శ్రీ కోయ హర్ష మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ఫోరం కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ జంగ చక్రధర్ రెడ్డి,ఆరెల్లి మల్లేష్, కోకన్వీనర్లు శనిగారపు నాగేశ్వర్, మండల కన్వీనర్లు తోట వెంకన్న,పెండ్యాల కుమార్, కల్లెపల్లి రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్, పోలీస్ కమిషనర్లను కలిసిన కాంగ్రెస్ కార్పొరేటర్‌లు

**ప్రజాపక్షం/కరీంనగర్:**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఎన్నికైన కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, కాంటెస్టెడ్ అభ్యర్థులతో వెళ్లి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంను కరీంనగర్లో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ పూల మొక్కలను అందించారు. అనంతరం పలు అంశాలపై జిల్లా కలెక్టర్, సిపితో రాజేందర్ రావు చర్చించారు. రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తున్నారని ఇంకా మరింత ప్రగతి పథంలో పరుగులు పెట్టేలా మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ దృష్టికి రాజేందర్రావు తీసుకొచ్చారు. కరీంనగర్ జిల్లాలో శాంతిభద్రతలు బేష్ గా ఉన్నాయని సిపి గౌష్ ఆలం కృషి ఎంతో ఉందని రాజేందర్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, కాంటెస్టెడ్ అభ్యర్థులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వీణవంకలో సిఐడి విచారణ

**ప్రజాపక్షం/వీణవంక:**హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పోలీసులు పెట్టిన కేసులపై సిఐడి అధికారులు విచారణ చేపట్టారు. వివరాల ప్రకారం మండల కేంద్రంలో గత నెలలో జరిగిన సమ్మక్క సారలమ్మ జాతరలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ స్థానిక పోలీసులు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసులు నమోదు చేశారు. అయితే ప్రభుత్వం కేసును సిఐడికి బదిలీ చేయగా మంగళవారం సిఐడి డిఎస్‌పి రంగస్వామి తన బృందంతో కలిసి విచారణ చేశారు. సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద జమ్మికుంట రూరల్ సిఐ లక్ష్మినారాయణను, జాతర జరిగిన స్థలం పక్కనే ఉన్న ఇంటి యజమాని మోటం సారయ్యను, జాతరలో దుకాణాలు ఏర్పాటు చేసుకున్న చిరువ్యాపారులను స్థానిక పోలీసు స్టేషన్‌లో ఈ సంధర్భంగా సిఐడి అధికారులు విచారణ చేశారు. హుజురాబాద్ ఏసిపి మాధవి, ఎస్ఐ ఆవుల తిరుపతి, సిఐడి అధికారులు ఉన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతరకు తనను, తన కుటుంబ సభ్యులను వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని ఇటీవల హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి డిజిపికి ఫిర్యాదు చేయగా ఎమ్మెల్యేపై పెట్టిన కేసుల గురించి సిఐడి అధికారులు వచ్చి విచారణ చేపట్టడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

## కాంగ్రెస్ నేత పీర్ మహమ్మద్ కృషి..

### 11వ వార్డులో సిసి రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలోని 11వ వార్డులో మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పీర్ మహమ్మద్ సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీర్ మహమ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో రూ. 6 లక్షల నిధులతో సుమారు 110 మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. గత కొద్ది రోజులుగా సీసీ రోడ్డు లేక పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వ విప్ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, సానుకూలంగా స్పందించి, సీసీ రోడ్డుకు శ్రీకారం చుట్టడం జరిగిందని స్పష్టం చేశారు. గత కొద్ది రోజులుగా పడుతున్న రోడ్డు సమస్య పరిష్కారం అవడంతో, స్థానికంగా ఉండే వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సీసీ రోడ్డు స్థాపనకు కృషిచేసిన ప్రభుత్వ ఆది శ్రీనివాస్‌కి కాంగ్రెస్ నేత పీర్ మహమ్మద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన

**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్ :** నీటి యాజమాన్యం, నేల యాజమాన్యం, ప్రాజెక్ట్ అభివృద్ధి, క్షేత్ర ప్రదరనశాల పి.డి.డి.ఎ చల్ గల్ జగిత్యాల యందు రైతులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించగా శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగిత్యాల జిల్లా వ్యవసాయధికారి భాస్కర్, వాలంతారి డైరెక్టర్ విజయ దుర్గ పాల్గొన్నారు.శిక్షణా కార్యక్రమంలో భాగంగా అధికారులు మాట్లాడుతూ రైతులు వివిధ రకాల పంటలకు నీటిని ఎలా వినియోగించుకోవాలో వివిధ రకాల నీటి యాజమాన్య పద్ధతులను వివరించటం జరిగిందని, అదే విధంగా నేల సంరక్షణలో భాగంగా, సేంద్రీయ వ్యవసాయం ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరిస్తూ ప్రదర్శించటం జరిగింది.ఈ శిక్ష ణా కార్యక్రమానికి నేటాఫీం కంపెనీ సుబ్బారావు, పిడిడిఎఫ్, డిడిఏ సునీత, పిడిడిఎఫ్, ఏడిఏ కల్పన, వాలంతారి ఏడి అన్నపూర్ణ, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండే ఇంటర్ పరీక్షలు ప్రారంభం

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి 30 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. జగిత్యాల జిల్లా ఇంటర్ పరీక్షల కన్వీనర్ బి.నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు వారి హాల్ టికెట్ లో సూచించిన కాలమానం ప్రకారం కంటే అర గంట ముందుగానే ఎగ్జామ్స్ సెంటర్లకు చేరుకోవాలని జిల్లా పరీక్షల కన్వీనర్ బి.నారాయణ విద్యార్థులకు సూచించారు.అదేవిధంగా ఎవరైనా విద్యార్థి పరీక్షలకు ఐదు నిమిషాలలో లేటుగా వచ్చిన పరీక్ష హాల్లోకి అనుమతించాలని, జగిత్యాల జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం 7699 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరంలో 7424 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యార్థులు వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకున్న హాల్ టికెట్ పై ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా విద్యార్థులను పరీక్ష హాలుకు అనుమతించాలని సెంటర్ల యాజమాన్యానికి సూచించడమైనది. ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపల్, మేనేజ్మెంట్లులు విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుంటే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని, ప్రతి పరీక్ష కేంద్రం వద్ద వైద్య శిబిరం ఉంటుంది. విద్యార్థులు ఒత్తిడి,ఆందోళనకు గురైనట్లయితే టెలి మానస్ టోల్ ఫ్రీ నెంబర్ 14416 కు నేరుగా ఫోన్ చేయవచ్చు. టోల్ ఫ్రీ నెంబర్ 24 గంటలు అందుబాటులో ఉంటుంది. జగిత్యాల జిల్లా ఇంటర్ పరీక్షల కన్వీనర్ బి.నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు.

## నృసింహుడిని దర్శించుకున్న సిబిఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారిని మంగళవారం సాయంత్రం సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ సతీసమేతంగా దర్శించుకున్నారు. మొదట ప్రదానాలయం శ్రీ యోగనంద స్వామివారి సన్నిదిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జేడీ లక్ష్మీనారాయణ దంపతులు అనంతరం అన్ని అనుబంధ ఆలయాలను సందర్శించి స్వామివారలనుదర్శించుకున్నారు.వీరికి దేవస్థానం వేద పండితులు ,ముఖ్య అర్చకులు స్వామివారి శేషవస్త్రం కప్పి ఆశీర్వచనం అందించారు.

## టిఎ,డిఎ ఇచ్చేందుకు ఒప్పుకున్న యాజమాన్యం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :**రాష్ట్రంలో ఇటీవల జరిగిన పంచాయతీ మరియు మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో విధులకు హాజరైన సింగరేణి మినిస్టీరియల్, సెక్యూరిటీ సిబ్బంది కి ఆన్ డ్యూటీ మరియు టి.ఎ.డి.ఎ లు ఇచ్చేందుకు యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందని ఏఐటియుసి యూనియన్ అర్జీ వన్ జి.ఎం.ఆఫీస్ డిపార్ట్మెంట్ కార్యదర్శి ఇజ్జగిరి రాజు, ఎస్ అండ్ పి సి డిపార్ట్మెంట్ కార్యదర్శి రెడ్డి వెంకట్ స్వామి లు ఒక సంయుక్త ప్రకటన లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన గ్రామపంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో విధులకు హాజరైన సింగరేణి మినిస్టీరియల్, సెక్యూరిటీ సిబ్బంది కి ఆన్ డ్యూటీ మరియు టి.ఎ.డి.ఎ లు ఇవ్వకుండా స్పెషల్ కోడ్ స్పెషల్ లీవ్ గా పరిగణించడం వల్ల ఎన్నికలు విధుల్లో హాజరైన సింగరేణి సిబ్బందికి ఎర్నుడు లీవులు, ప్రాఫిట్ షేర్ బోనస్ లో మస్టర్లు తక్కువగా నమోదు కావడం వల్ల చాలా ఆర్థిక నష్టం వాటిల్లిందని, ఇట్టి విషయం ఏఐటియుసి గుర్తింపు సంఘం దృష్టికి మినిస్టీరియల్, సెక్యూరిటీ సిబ్బంది వినతి పత్రాలు ఇచ్చి యాజమాన్యం తో మాట్లాడి స్పెషల్ కోడ్ ను రద్దు చేసి ఓ.డి మరియు టి.ఎ.డి.ఎ లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందని వారు పేర్కొన్నారు. దీని పై ఏఐటియుసి నాయకులు సీతారామయ్య, రాజ్ కుమార్ లు యాజమాన్యం కు లేఖ రాసి చర్చించిన మేరకు యాజమాన్యం స్పందించి ఎన్నికల్లో పాల్గొన్న సింగరేణి మినిస్టీరియల్, సెక్యూరిటీ సిబ్బంది కి ఓ. డి మరియు టి.ఎ.డి.ఎ ఇచ్చేందుకు అంగీకరించి సర్క్యులర్ జారీ చేసిందని, ఇది చాలా లాభదాయకంగా హక్కు ను సాధించుకోవడం జరిగిందని, మినిస్టీరియల్, సెక్యూరిటీ సిబ్బంది చేసిన వినతి పై స్పందించి, ఏఐటియుసి చేసిన కృషి ని మినిస్టీరియల్, సెక్యూరిటీ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా ఏఐటియుసి అద్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ లకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామని వారు పేర్కొన్నారు. ఇంకా అభినందనలు తెలిపిన వారిలో ఏఐటియుసి జి.ఎం.కమిటి మెంబర్ సిద్ధమల్ల రాజు, మినిస్టీరియల్ స్టాప్ ఇంచార్జిమినిస్టీరియల్ స్టాప్ వినోద్, సంతోష్, పద్మ, మాలతి ఉన్నారు.

## నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

### పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయ రమణారావు

**ప్రజా పక్షం/సుల్తానాబాద్ :**శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దయతో నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మ తల్లికి మొక్కులు సమర్పించారు పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సుల్తానాబాద్ మండలంలోని నారాయణపూర్ గ్రామంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేణుకా ఎల్లమ్మ తల్లి గుడి నిర్మాణం చేసిన గౌడ కులస్తులకు అభినందనలు తెలుపుతూ ఎల్లమ్మ తల్లి అనుగ్రహం గౌడ కులస్థులకు గ్రామ ప్రజలతోపాటు నియోజకవర్గ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని.త్వరలోనే గుడి ప్రహరీ గోడకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.నారాయణపూర్ మాజీ ఎంపిటిసి మండల రమేష్, కొండల్ రావు, మాధవరావు, గౌడ కుల పెద్దలు బుర్ర బాణయ్య, బాలసాని శ్రీనివాస్, మూల హరీష్, బాలసాని సురేష్,మారేడుగొండ సధి,పడాల శంకర్, వెగోళపు మల్లికార్జున్, తాళ్లపల్లి రాజు, పొన్నం రవి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులుపాల్గొన్నారు.

## అవినీతిని అక్రమాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులా?



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్టిఏ ద్వారా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి బయట పెడితే అక్రమ కేసులు పెట్టడం ఏంటని బిజెపి పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కామారెడ్డి లో షబ్బీర్ అలీ అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని న్యాయబద్ధంగా బయటపెట్టిన ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి పై కేసులు పెట్టడం సరైనది కాదని దానిని ప్రశ్నించేందుకు వెళుతున్న రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ను అడ్డుకొని గృహ నిర్బంధం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నీ అంత పాలనకు అద్దం పడుతుందని అన్నారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు బిజెపి పార్టీ వారే ఉన్నారని ప్రజలు బిజెపిని ఆదరిస్తున్నారని రానున్న 2029 లో బిజెపి అధికారంలోకి వస్తుందని అప్పుడు తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలో 9 సంవత్సరాలు బి.ఆర్.ఎస్ వ్యవహరించిన తీరుకు మించి ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తుందని పోలీసులు సైతం కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తల పని చేస్తున్నారని అన్ని నోట్ చేసి పెట్టుకుంటున్నామని తిరిగి ఇంతకు ఇంత ఇరు పార్టీల వారు అనుభవించాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు.ఎన్నికలలో రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సింది పోయి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రౌడీయిజం చెలాయించిందని దానికి నిదర్శనమే ఎంపీ ధర్మపురి అరవింద్ సాక్షాత్తు ఎన్నికల జరిగే ప్రాంతాలకు వెళ్లి అధికారులతో గొడవకు దిగారని తెలిపారు. బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు సొదరి మహేందర్ యాదవ్, పార్టీ శ్రేణులు మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, మెండే శంకరయ్య, ఎల్లంకి రాజు, కొల్లూరి సంతోష్, కొమ్మిడి రాజేందర్ రెడ్డి, మల్కా భాగ్యలక్ష్మి , ఎర్రం సంతోష్ రెడ్డి, మహేష్ పటేల్, వలస సాయి, లతోపాటు పలువురు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/ మెట్ పల్లి :** ఐక్యా మైండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉద్యోగ ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ కుమార్ అన్నారు. మెట్ పల్లి ఐక్యా మైండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 22న మెట్ పల్లిలో చేపట్టిన ఓపెన్ ఉద్యోగ మేళకు హాజరై ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించిన పలువురు యువతకు మంగళవారం నియామక పత్రాల అందజేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యువతకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక యుగంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడానికి మెట్ పల్లి ఐక్యా మైండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు ఎండీ యాసీన్,ఎండీ బిస్మిల్లా ముందుకు రావడం అభినందనీయం అన్నారు. కాగా ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ గా మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ గా ఓంకారి నవీన్ కుమార్ లు విజయం సాధించగా మెట్ పల్లి ఐక్యా మైండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు ఎండీ యాసీన్, ఎండీ బిస్మిల్లా ఘనంగా సన్మానించారు. మెట్ పల్లి ఐక్యా మైండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు ఎండీ యాసీన్, ఎండీ బిస్మిల్లా, అధ్యాపకులు పులిమామిడి ప్రవీణ్ కుమార్ (ఎంఏ ఇంగ్లీష్), నాయకులు మైలారపు రాంబాబు, కోట కిరణ్ కుమార్,సిబ్బంది డీ. మనోహర్, బీ. రాజేందర్, బీ. మాధవి, పలువురు యువత పాల్గొన్నారు.

## ప్రజాసేవే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు

**ప్రజాపక్షం/పాలకుర్తి :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కన్నాల గ్రామంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు జన్మదినాన్ని పురస్కరించుకునిడిసిసి ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య ఆధ్వర్యంలో మంగళవారం కన్నాల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సేవా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు పంపిణీ చేశారు.సూర సమ్మయ్య మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభ్యాసానికి అండగా నిలుస్తామన్నారు.విద్యార్థుల భవిష్యత్తు దేశ భవిష్యత్తు అని పేర్కొంటూ,కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.నాయకత్వం అంటే పదవులు కాదు, ప్రజాసేవని, విద్యార్థుల అభివృద్ధే నిజమైన అభివృద్ధి అని అన్నారు. దుద్దిళ్ల శ్రీనుబాబు సేవాస్ఫూర్తి ఆదర్శంగా తీసుకుని సమాజానికి అంకితభావంతో పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ కమలాకర్, రఘునందన్ రావు,బామ్లానాయక్ తండా గ్రామ సర్పంచి అఖిల అంజి నాయక్, మాజీ ఉప సర్పంచి జ్యోతి శంకర్ నాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యులు దేవి లక్ష్మి నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా జాయింట్ సెక్రటరీ గౌస్యబేగం, మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ దండుగుల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి అరుకల సతీష్,సింగల్ విండో డైరెక్టర్ సక్లల్, రాణాపూర్ వార్డు సభ్యులు, ఉమ్మడి కన్నాల గ్రామ మాజీ వార్డు సభ్యులు సురేష్, సాగర్ గౌడ్, లక్ష్మ ణ్ రావు, ముంజ రాజు,ఆరిఫ్ పాషా, గ్రామ పెద్దలు,పార్టీ శ్రేణులు, యువకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లిలో స్టడీ సెంటర్ ఏర్పాటుకు మంత్రి సానుకూలత

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని మూడవ వార్డులో విద్యార్థుల సౌకర్యార్థం స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలన్న వినతిపై రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ సానుకూలంగా స్పందించారు.మంగళవారం మూడవ వార్డు కౌన్సిలర్ బత్తుల నరేష్, కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు ఆదేశాల మేరకు మంత్రిని కలిసి వార్డులో స్టడీ సెంటర్ అవశ్యకతను వివరించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుపేద విద్యార్థులకు, యువతకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. కౌన్సిలర్ విజ్ఞప్తిపై మంత్రి తక్షణమే స్పందించారు.అక్కడికక్కడే ఆర్‌డీవో (RDO) తో ఫోన్లో మాట్లాడి, స్టడీ సెంటర్ ఏర్పాటుకు సంబంధించి తగిన స్థలాన్ని పరిశీలించి,అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రి త్వరితగతిన స్పందించడం పట్ల స్థానిక విద్యార్థులు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌తో పాటు రాజ్యాంగ రక్షక దళ్ అధ్యక్షులు రేంజర్ల రాజేష్,సోమిడి సృజన్ముతునూరి సురేష్,నరేష్,ఆనంద్,శివ, అరవింద్,తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువుల ద్వారా పండించుకున్న ఆహారాన్ని ఇంటిల్లిపాదికి అందించవచ్చు



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట రైతు వేదికలో మహిళా రైతులకు, ఇతర రైతులకు కిచెన్ గార్డెనింగ్ పెరటితోట పెంపకముపై ఎటిఎంఎ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జగిత్యాల నియోజకవర్గ ఉద్యాన శాఖాధికారి కె.స్వాతి మాట్లాడుతూ ప్రతి ఇంటిలో కిచెన్ గార్డెను ఏర్పాటు చేసుకోవడం ద్వారా కుటుంబానికి నిత్యము అవసరమైన తాజా కూరగాయలు,ఆకుకూరలను స్వయంగా పండించుకునే వీలు ఉంటుంది. సేంద్రీయ ఎరువుల ద్వారా పండించుకుని రసాయనాలు లేని ఆహారాన్ని ఇంటిల్లిపాదికి అందించవచ్చునని నియోజకవర్గ ఉద్యాన శాఖాధికారి కె.స్వాతి రైతులకు వివరించడం జరిగింది. జగిత్యాల అర్బన్ మండల వ్యవసాయధికారి బి.వినీల మాట్లాడుతూ రైతులు వరి, మొక్క జొన్న వంటి పంటలే కాకుండా ప్రభుత్వ సబ్సిడి పై ఆయిల్ పామ్ మొక్కలు 90% సబ్సిడి పై రైతులకు అందుబాటులో ఉన్నాయని, డ్రిప్ స్ప్రింక్లేర్ సబ్సిడీ పై ఉన్నందున ఇట్టి అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.వినీల తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.ఇ.ఓ.లుగంగాలక్ష్మి , అనిల్ కుమార్, అంబారిపేట గ్రామ సర్పంచ్ గాడిదెల గంగాధర్, ఉప సర్పంచ్ గంగాధర్, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

# నేడు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు బాధ్యతలు స్వీకరణ

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పురపాలక సంఘం నూతన పాలకవర్గం సభ్యులు బుధవారం భాధ్యతలు స్వీకరించును న్నారు.పుర కార్యాలయంలో జరుగనున్న ఈ కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరుకానున్నారు.ధర్మపురి మున్సిపల్ పరిధిలో 15 వార్డులుండగా 15 వార్డులను కాంగ్రేస్ అభ్యర్థులే గెలిచి క్లీన్ స్వీప్ చేయగా వీరిలో మున్సిపల్ చైర్ పర్సన్ గా వేముల నాగ లక్ష్మి, వైస్ చైర్మన్ గా ఇందారపు రామయ్యలు ఎన్నికైన విషయం విదితమే.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో లబ్ధిదారుల్లో ఆనందం

**ప్రజాపక్షం/ మల్లాపూర్ :** రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి కట్టుబడి ఉండి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారని రత్నాపూర్ గ్రామ సర్పంచ్ గోండ రాజేందర్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామానికి చెందిన ముత్యాల మీన కు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, లబ్ధిదారులు,గ్రామస్తులున్నారు.

## అనుమానాస్పద మృతి కేసు మర్డర్‌గా నిర్ధారణ

ఆరుగురు నిందితులు అరెస్టు

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామ శివారులో ఈనెల 20 న మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామానికి చెందిన ఎర్రోళ్ల లింబాద్రి (51) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మండల ప్రజలకు తెలిసిందే దీంతో గ్రామపంచాయతీ కార్యదర్శి మనోజ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసు ముమ్మర దర్యాప్తు అనంతరం ఎస్సై జి. నవీన్ కుమార్, మెట్పల్లి సిఐ వి. అనిల్ కుమార్ దర్యాప్తులో భాగంగా ఈ ఘటనను మర్డర్‌గా నిర్ధారించారు. మర్డర్ చేసిన నిందితులు ఎర్దండి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల లక్ష్మి, ఎర్రోళ్ల లితిప్, కల్లెడ నరేందర్, బోదాసు సంతోష్, కల్లెడ వర్షిత్, కల్లెడ సంపత్ అనే ఆరుగురు నిందితులను సోమవారం అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు.నిందితుల వద్ద నుండి రెండు ఇనుప స్టేజ్ పైపులు, మూడు ద్విచక్ర వాహనాలు,ఆరు మొబైల్ ఫోన్ల ను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నవీన్ కుమార్ పేర్కొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన కొండగట్టు

**ప్రజాపక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది.ఉదయం నుంచి అంజన్న దర్శించుకోవడానికి భక్తులు వేలాదిగా కొండ పైకి తరలివచ్చి ప్రత్యేక, ఉచిత దర్శనా ల ద్వారా దర్శించుకున్నారు.ఆలయ పరిసరాలైన బేతాళ స్వామి రాముల వారి ఆలయాల్లోనూ భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకులు స్వామివారి కి చందన అలంకారాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# 27 నుంచి మూర్మూర్ కొమురన్న జాతర

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మూర్మూర్ లో ఈనెల 27 నుంచి జరగనున్న మూర్మూర్ కొమురన్న జాతర, శ్రీమల్లిఖార్జున స్వామి, దేవతా విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమాలను విజయవంతం చేయాలని శ్రీకొమురన్న జాతర మల్లిఖార్జున దేవస్థాన ఆహ్వాన కమిటి కార్యనిర్వాహకులు గోపు అయిలయ్య యాదవ్ కోరారు. దేవాలయం ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూర్మూర్‌కు చెందిన వాక్సిద్ధి గోపు కొమురయ్య పేరిట గత ఆరు దశాబ్దాలుగా ఈ జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతర ప్రదేశంలోని పాత గుడి స్థానంలో నూతనంగా శ్రీ మల్లిఖార్జునస్వామికి దేవాలయం నిర్మించినట్లు తెలిపారు. ఈనెల 27 నుంచి నాలుగు రోజులపాటు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలతోపాటు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతి ఏటా జరిపే కొమురన్న జాతరను కూడ ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి గోపు వంశస్తులైన గోపు పోచయ్య యాదవ్, గోపు బొర్రయ్య యాదవ్, గోపు మల్లయ్య యాదవ్, గోపు చంద్రయ్య యాదవ్, గోపు అయిలయ్య యాదవ్ లు, వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతర మొదటి రోజున ఉదయం స్వామి వారికి దృష్టి కుంభం, మైలలు తీయుట, రుద్రాభిషేకం, బియ్యం, సుంకు పెద్దపట్నం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడో రోజు ఆదివారం ఉదయం 11.10 గంటలకు జంగమ మహేశ్వరులచే శ్రీమేడలాదేవి కేతమ్మ సహిత శ్రీ మల్లిఖార్జునస్వామి కళ్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు. స్వామి వారిని దర్శించుకొని అభిషేకాలు, హోమాలు, పసుపు, కుంకుమలతో పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకోవాలన్నారు. సోమవారం తెల్లవారుజామున అగ్ని గుండ ప్రవేశం, ఒగ్గు కథ ప్రదర్శనలు, అన్నదానం కార్యక్రమాలు కూడ నిర్వహించనున్నట్లు తెలిపారు. గోదావరిఖని ఆర్టీసీ బస్టాండు నుంచి జాతర జరిగే ప్రదేశం వరకు ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పించినట్లు, జాతర జరిగే ప్రదేశంలో భక్తులకు విడిది, తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్ల వంటి అన్ని సదుపాయాలు కల్పించినట్లు గోపు అయిలయ్య యాదవ్ తెలిపారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచి గోపు కొమురయ్య యాదవ్, గోపు మల్లయ్య యాదవ్, సామల కొమురయ్య యాదవ్, గోపు మల్లేష్ యాదవ్, గోపు అశోక్ యాదవ్, నాయకులు ఎల్ల కొమురయ్య యాదవ్ పాల్గొన్నారు.

# భక్తుల భద్రత అత్యంత ప్రాధాన్యతగా ప్రణాళికలు సిద్ధం

గోదావరి పుష్కరాలు 2027కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** గోదావరి పుష్కరాలు వచ్చే సంవత్సరం –2027 సంబంధించి నిర్వహణకు భద్రతా పరంగా చేపట్టాల్సిన చర్యలపై పుష్కరాలు జరిగే ప్రాంతాల పోలీస్ స్టేషన్ ఎస్.ఐలు, సంబంధిత సి.ఐలు, డి.ఎస్.పిలతో సమీక్షా సమావేశం మంగళవారం జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ శాఖ తరపున చేపట్టాల్సిన సమగ్ర భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్, పార్కింగ్ నియంత్రణ, సీసీ టీవీ కెమెరాల విస్తృత ఏర్పాటు, మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలు, విఐపీ ఘాట్‌లు, పుష్కర ఘాట్‌లు, తాత్కాలిక స్నాన ఘాట్‌ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ఎస్పీ చర్చించారు.ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ రాబోయే పుష్కరాలను పురస్కరించుకొని జిల్లాకు ప్రతిరోజు సుమారు 15 లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారి భద్రతను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సంబంధిత పోలీసు అధికారులు ఎస్పీ ఆదేశించారు. గత పుష్కరాల అనుభవాలను విశ్లేషించి,ఈసారి మరింత కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.ప్రధాన స్నాన ఘాట్‌లు, మంగళ ఘాట్,విఐపీ ఘాట్‌లు, పుష్కర హారతి ప్రదేశాలు,ఇరుకు రహదారులను హై రిస్క్ ప్రాంతాలుగా గుర్తించి అదనపు పోలీస్ బలగాలను మోహరించాలని తెలిపారు.ప్రతి ఘాట్‌కు ప్రత్యేక అత్యవసర మార్గం కేటాయించి అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు సులభంగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.పుష్కరాల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక రూట్ మ్యాప్ సిద్ధం చేసి,వాహనాల రాకపోకలకు వన్‌వే, ప్రత్యామ్నాయ మార్గాలను అమలు చేయాలని పార్కింగ్ స్థలాలను ముందుగానే గుర్తించి ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పోలీసు అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో డి.ఎస్.పి.లు రఘు చందర్, రాములు, సి.ఐ.లు అనిల్ కుమార్, సుధాకర్, రామ్ నరసింహ రెడ్డి, ఎస్.ఐ.లు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం.. రైతులకు తీరని నష్టం

మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల మండలంలో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షానికి మామిడి, మొక్కజొన్న పంట నేలకు కొరిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లడంతో జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామంలో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పర్యటించి అకాల వర్షం రైతులకు భారీ నష్టం వాటిల్లిందని అని మాజీ మంత్రి అన్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నుముక అలాంటి రైతును రైతాంగాన్ని ఆదుకోవాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు బిడ్డ కాబట్టి రైతుల పక్షాన దృష్టి సారించాలని ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని మాజీ మంత్రి ఆశిస్తున్నారు. జగిత్యాల జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులతో ఫోన్ లో మాజీ మంత్రి మాట్లాడి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సూచించారు. వారి వెంట రైతులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.

**నష్ట పోయిన పంటలను మాజీ జడ్పీ చైర్ పర్సన్ పరిశీలన :** జగిత్యాల రూరల్ మండలం చల్గల్ గ్రామంలో రాత్రి కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులు రాజేందర్, వెంకట స్వామి మొక్క జొన్న పంటను రైతులు, నాయకులతో కలిసి జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ పరిశీలించారు. నష్టపోయిన రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ జెడ్పీ చైర్మన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం అందించాలి అని మాజీ జెడ్పీ చైర్మన్ అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆనందరావు, మాజీ సర్పంచ్ ఎల్ల రాజన్న, గ్రామ శాఖ అధ్యక్షుడు పూదరి శ్రీను, వార్డు మెంబర్ బొల్లారం ముత్యం, బాలే చందు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట గంగరాజం, యూత్ అధ్యక్షులు బదుగు గోపాల్, కుంట వెంకన్న, చింతలపల్లి దేవన్న, దాసరి నరసయ్య, అల్లం నాగ స్వామి, ఓగులపు రాజేందర్, చిన్న కోల నరేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో యువత ముందడుగు

**ప్రజాపక్షం/కోరుట్ల :** కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల నేషనల్ సర్వీస్ స్కీమ్ ఆధ్వర్యంలో సంగెం గ్రామంలో ఏడు రోజుల ప్రత్యేక శీతాకాల శిబిరం ఘనంగా ప్రారంభమైంది.మంగళవారం సంగెం గ్రామంలోని పంచాయతీ భవనంలో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ అధ్యక్షత వహించారు. కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నడికట్ల సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, ఈ ఏడు రోజుల శిబిరం ద్వారా విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని కోరారు.గ్రామ సర్పంచ్ సిటీ స్వరూప వెంకట్రావు మాట్లాడుతూ తమ గ్రామాన్ని ఎన్ఎస్ఎస్ శిబిరం కోసం ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.వారం రోజుల పాటు జరిగే స్వచ్ఛభారత్, సామాజిక సర్వే,ఆరోగ్య అవగాహన వంటి కార్యక్రమాలకు గ్రామ పంచాయతీ పక్షాన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఎన్ఎస్ఎస్(NSS) ప్రోగ్రామ్ ఆఫీసర్ (కోఆర్డినేటర్) డాక్టర్ ఈ.రాజకుమార్ మాట్లాడుతూ ఈ శిబిరంలో భాగంగా గ్రామంలో పిచ్చి మొక్కల తొలగింపు, ప్లాస్టిక్ రహిత గ్రామంపై అవగాహన,వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది, గ్రామ పెద్దలు, ఉప సర్పంచి సుధవేని మహేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శేఖర్, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు సుదవేని భూమయ్య,జె నగేష్,కొమ్ముల మోహన్ రెడ్డి,వార్డ్ మెంబర్ వల్ల కొండ శ్రీహరి,పెద్ద సంఖ్యలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## అప్పు చెల్లించలేక మహిళ ఆత్మహత్య

**ప్రజాపక్షం/మల్యాల :** ఆర్థిక ఇబ్బందులతో పాటు మనో వేదనకు గురై మహిళా ఆత్మ హత్య చేసుకున్న ఘటన మంగవారం మల్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా మల్యాల మండలంనూకపల్లి అర్బన్ కాలనీ లో ఏ పీ లోని విజయవాడకి చెందిన కనగల లక్ష్మణ్ బాబు అనూష దంపతులు నివాసముంటున్నారు.అనూష జగిత్యాల్లో టైలరింగ్ పనిచేస్తూ,తన భర్త వెల్డింగ్ పని చేసుకుంటూ గడుపుతున్నారు.గతంలో అనూష తన తల్లిగారి గ్రామమైన విజయవాడ కు చెందిన శిరీష దగ్గర లక్ష రూపాయలు అప్పుగా తీసుకున్నట్లు తెలిపారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించక తీసుకున్న అప్పులో కొంత మేర చెల్లించి మిగతాది చెల్లిస్తానని ఒప్పుకున్నట్లు ఈ క్రమంలో మంగళవారం విజయవాడకు చెందిన శిరీష తన మిత్రులతో కలిసి నూకపల్లి అర్బన్ కాలానికి వచ్చి అనూషను మిగతా డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేసి నానా దుర్భాషలాడుతూ చావు అని వేధింపులకు గురి చేయడంతో ఆ మాటలను తట్టుకోలేక తీవ్ర మనోవేదనకు గురై రాజారాం సమీపంలోని కాకతీయ కాలువలు దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. మృతురాలి భర్త లక్ష్మ ణ బాబు ఫిర్యాదు మేరకు శిరీష ,నోషిత సతీష్ ,ఓంకార్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇదిలా ఉండగా మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## నేల వాలిన మొక్క జొన్న పరిశీలన



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామాలలో మొక్కజొన్న పంట నేల వాలింది. ఈ సందర్భంగా మంగళవారం మండల వ్యవసాయ అధికారి ఆకు రాజకుమార్ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు ఆయా గ్రామాలలోని285 ఎకరాలలో మొక్క జొన్న పంట నేలవాలినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు ఏవో తెలిపారు. దాదాపుగా 335 మంది రైతులకు చెందిన మొక్కజొన్న పంటను అంచనా వేసి జిల్లా వ్యవసాయ అధికారికి నివేదిక పంపినట్లు ఏవో తెలిపారు.ఈ కార్యక్రమం లో ఏ ఈ ఓ లు సాయికృప, రవళిక, సాగర్, వినోద్, సర్పంచ్ ఫోన్ కంటి చిన్న వెంకట్, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అభిషేక్ ప్రతిభ



**ప్రజాపక్షం / జన్నారం :** రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జన్నారం రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల విద్యార్థి కొట్టె అభిషేక్ ద్వితీయ బహుమతి సాధించి సిఎం కప్ గెలుచుకున్నాడు. ఇంటర్మీడియట్ బైపిసి ప్రథమ సంవత్సరం చదువుతున్న అభిషేక్ ఈ ఘనత సాధించడం పట్ల మంగళవారం కళాశాల ప్రాంగణంలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ విద్యార్థిని అభినందిస్తూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎర్ర సంపత్, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్, డీన్ హేమలత షిండే, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాల నిఘాలో ఇంటర్ పరీక్షలు

**ప్రజాపక్షం / తిర్యాణి :** తిర్యాణి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంచార్జి ప్రిన్సిపాల్, ప్రధాన పరీక్షాధికారి ఎం. సత్య గణపతి రావు తెలిపారు. బుధవారం (ఫిబ్రవరి 25) నుండి ప్రారంభం కానున్న ఈ పరీక్షలు మార్చి 16 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి గదిలో సిసి కెమెరాల నిఘాతో పాటు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లు, రాత పరికరాలతో హాజరుకావాలని, మొబైల్ ఫోన్లు లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదని హెచ్చరించారు.

## గంభీరావుపేట మీదుగా బస్సు సర్వీసులు పునరుద్ధరించాలి

### సర్పంచులు జుమ్మడి కిష్టయ్యా, మడవి రాజేష్

**ప్రజాపక్షం / తిర్యాణి :** మంచిర్యాల డిపో నుండి తిర్యాణి మండలానికి నడిచే ఆర్‌టిసి బస్సులను గంభీరావుపేట మీదుగా పునరుద్ధరించాలని కోరుతూ గంభీరావుపేట సర్పంచ్ జుమ్మడి కిష్టయ్యా, తిర్యాణి సర్పంచ్ మడవి రాజేష్ మంగళవారం మంచిర్యాల డిపో మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించారు. గతంలో ఈ గ్రామం మీదుగా బస్సులు నడిచేవని, ప్రస్తుతం అవి నిలిచిపోవడంతో గ్రామస్తులు రవాణా పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని గ్రామానికి చెందిన మహిళలు వినియోగించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచిర్యాల నుండి ఉదయం 9 గంటలకు బయలుదేరే బస్సుతో పాటు రాత్రి సుంగాపూర్ వెళ్లే బస్సును గంభీరావుపేట, వాయ తిర్యాణి, తలండి మార్గంలో నడపాలని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే అధికారులు స్పందించి బస్సు సర్వీసులను ప్రారంభించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు పెరుమండ్ల వెంకటేశం గౌడ్, ఉపసర్పంచ్ కుదురుపాక పవన్, కోర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో జిల్లా పోలీసుల ప్రతిభ



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** సైబరాబాద్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగవ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీల్లో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీసులు పలు పతకాలు సాధించారు. విజేతలను జిల్లా ఎస్‌పి నితిక పంత్ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పోలీస్ సిబ్బందిలోని క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహించడంలో జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆమె వివరించారు.పతకాలు సాధించిన వారిలో.. సెపక్ తక్రా క్రీడా విభాగంలో పొట్ట గోపి (కెప్టెన్), కిరణ్ కుమార్, రాజేష్ రజత పతకాలు సాధించారు. మహిళల బాడ్మింటన్ డబుల్స్ విభాగంలో మహిళా కానిస్టేబుల్ సువార్త రజత పతకం గెలుచుకున్నారు. బాక్సింగ్ లో పూల్ సింగ్ రజత పతకం, టైక్వాండోలో పూల్ సింగ్, ఎస్. వినయ్ కుమార్ కాంస్య పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ వామన మూర్తి, ఆర్ఐ స్పెషల్ పార్టీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రోడ్డు పనుల్లో నాణ్యత లోపం



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** మండల కేంద్రంలో ఇటీవల చేపట్టిన ప్రధాన రహదారి పనుల్లో నాణ్యత లోపించిందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో నిర్మించిన ఈ రోడ్డు వేసిన కొద్ది రోజులకే చిన్న చిన్న రాళ్లు తేలుతుండటం పట్ల గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బ్లాక్‌టాపర్ పొరను నిర్దేశిత మందంతో వేయకపోవడం వల్ల రహదారిపై గీతలు పడుతున్నాయని, వర్షాకాలంలో నీరు నిలిచి రోడ్డు మరింత దెబ్బతినే ప్రమాదం ఉందని వారు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణంలో పాటించాల్సిన సబ్‌గ్రేడ్, బేస్ కోర్స్ వంటి సాంకేతిక నిబంధనలను అధికారులు విస్మరించారని స్థానికులు పేర్కొంటున్నారు. పర్యవేక్షించాల్సిన ఇంజినీరింగ్ అధికారులు కచ్చితమైన తనిఖీలు నిర్వహించకుండానే బిల్లులు చెల్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. క్వాలిటీ కంట్రోల్ పరీక్షలు నిర్వహించకుండా ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు తక్షణమే స్పందించి సాంకేతిక కమిటీతో విచారణ జరిపించాలని, నిబంధనలు ఉల్లంఘించిన కాంట్రాక్టర్, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కళా ప్రదర్శనలతో రోడ్డు భద్రతపై అవగాహన



**ప్రజాపక్షం / కేరమేరి :** రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం కేరమేరి మండలంలో పోలీస్ కళాబృందం విస్తృత ప్రదర్శనలు నిర్వహించింది. జిల్లా ఎస్‌పి నితిక పంత్ ఆదేశాల మేరకు ఎస్ఐ మధుకర్ పర్యవేక్షణలో దేవాపూర్, అనార్పల్లి, కేలి గ్రామాలలో ఈ ప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాబృందం సభ్యులు పాటలు, ఆటల ద్వారా రోడ్డు నిబంధనల ప్రాముఖ్యతను ప్రజలకు, యువతకు వివరించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. అతివేగం, మైనర్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి నిర్లక్ష్య చర్యల వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్ఐ మధుకర్ తెలిపారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండి ప్రాణనష్టాన్ని నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శంకర్, పోలీస్ కళాబృందం సభ్యులు రోహిత్, రామ్‌చందర్, సంఘవి పాల్గొన్నారు.

## శ్రీవారి దర్శనానికి 758 కిలోమీటర్ల పాదయాత్ర

**ప్రజాపక్షం/ పెంచికలపేట్ :** కాగజ్ నగర్ మండలంలోని ఆరెగూడ గ్రామానికి చెందిన ఇద్దరు భక్తులు తమ మొక్కు తీర్చుకునేందుకు తిరుమల తిరుపతి దేవస్థానానికి పాదయాత్రగా బయలుదేరారు. గ్రామానికి చెందిన సద్గారి లక్ష్మణ్, బీమన్కార్ మెంగాజీ మంగళవారం ఇస్గాం లోని శ్రీ శివ మల్లన్న స్వామి ఆలయాన్ని దర్శించుకొని తమ ప్రయాణాన్ని ప్రారంభించారు. సుమారు 758 కిలోమీటర్ల మేర సాగే ఈ యాత్రను వారు ఎటువంటి పాదరక్షలు లేకుండా కొనసాగించనున్నారు. కష్టసుఖాలను లెక్కచేయకుండా పవిత్రమైన సంకల్పంతో తిరుమల చేరుకోవాలన్న వీరి భక్తి అందరికీ ఆదర్శమని గ్రామ పెద్దలు కొనియాడారు. భక్తి శ్రద్ధలతో చేపట్టిన ఈ పాదయాత్ర విజయవంతంగా పూర్తి కావాలని ఆకాంక్షిస్తూ గ్రామస్తులు వారిని సాగనంపారు.



## సింగల్‌గూడ, ఎన్‌టిఆర్ కాలనీలో తీరిన నీటి కష్టాలు



**ప్రజాపక్షం / రెబ్బెన :** రెబ్బెన గ్రామ పంచాయతీ పరిధిలోని సింగల్‌గూడ, ఎన్‌టిఆర్ కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తూ నూతనంగా బోరుబావులను ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్ ఎంఎల్‌ఎ కోవ లక్ష్మి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సిఎస్ఆర్ నిధులతో మంగళవారం బోరుబావులను తవ్వించారు. కాలనీల్లో ఏళ్ల తరబడి ఉన్న నీటి ఎద్దడిని గుర్తించి, యుద్ధ ప్రాతిపదికన బోరుబావులు వేయించడం పట్ల స్థానికులు ఎంఎల్‌ఎకు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం నీటి సమస్యను తీర్చడంపై గ్రామంలో సంతృప్తి వ్యక్తమవుతోంది. రెబ్బెన సర్పంచ్ దుర్గం భరద్వాజ్, ఉప సర్పంచ్ పులకండం వరలక్ష్మి దుర్గారావు, మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, వార్డు సభ్యులు వరకృష్ణ, భార్గవ్ గౌడ్ పాల్గొన్నారు.

## నేటి నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలో నేడు బుధవారం నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతాయని డిపార్టుమెంటల్ ఆఫీసర్ మురళీ మోహనకృష్ణ మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఉదయం 9 గం,ల నుండి మద్యాహ్నం 12 గం.ల వరకు పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. తెలుగు, హిందీ, సంస్కృతం, వొకేషనల్ పరీక్షలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. విద్యార్థులువిద్యార్థులు తమ ఉపాధ్యాయుల సూచనలు పాటించి నిర్ణీత సమయంలోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని చీఫ్ సూపరిండెంట్ పి.శివకుమార్ సూచించారు.

## సీఏల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మహ్మద్‌నగర్ మండలకేంద్రంలో మంగళవారం సొసైటీ ఫంక్షన్‌హాల్‌లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగిరెడ్డిపేట రవీంధర్‌రెడ్డి చేతుల మీదుగా ఐకేపీ సీఏల డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్రయకమంలో మహ్మద్‌నగర్ మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు రమేష్‌యాదవ్, గజ్జల జీవన్, కిరణ్, రఫీ, మండల కాంగ్రెస్ నాయకులు గొట్టం నర్సింలు, ఆకాష్, కొరమండల్ సాయాగౌడ్, ఐకేపీ సీఏల మండల అధ్యక్షుడు మెట్ట భూమయ్య, ఆయా గ్రామాల సీఏలు పాల్గొన్నారు.

## రెబ్బెనలో ఆగని ఇసుక దందా

### పగలు రాత్రి తేడా లేకుండా అక్రమ రవాణా

**ప్రజాపక్షం/రెబ్బనః** ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో ఇసుక దోపిడీ పతాక స్థాయికి చేరింది. చట్టాలు, పర్యావరణ నిబంధనలను తుంగలో తొక్కుతూ కొందరు వ్యక్తులు అక్రమ ఇసుక రవాణాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. సాక్ష్యాధారాలతో సహా అక్రమ దందాను బయటపెట్టినప్పటికీ, అధికారులు కేసులు పెడుతున్నప్పటికీ అక్రమార్కులు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. ప్రధానంగా తక్కల్లపల్లి, రోళ్లపాడు, నారాయణపూర్, కొమరవెల్లి మార్గాల ద్వారా మంచిర్యాల జిల్లాకు ఇసుక తరలిస్తున్నారు. ప్రభుత్వం నూతన ఇసుక పాలసీని తీసుకొచ్చినప్పటికీ ఎటువంటి అనుమతులు లేని ట్రాక్టర్లతో ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా, అతివేగంగా వెళ్లే ఇసుక ట్రాక్టర్లతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.. తహసీల్దార్ సూర్య ప్రకాష్ఈ విషయంపై రెబ్బెన తహసీల్దార్ సూర్యప్రకాష్ వివరణ ఇస్తూ ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ట్రాక్టర్లను సీజ్ చేసే అవకాశం ఉంటుందని, రాత్రి సమయంలో తామేమీ చేయలేమని పేర్కొన్నారు. తమ దృష్టికి వచ్చిన ట్రాక్టర్లను పట్టుకొని జరిమానాలు విధిస్తున్నామని, ఈ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్రమ రవాణాను అరికట్టేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

## పిట్టగూడలో తీరిన తాగునీటి కష్టాలు

**ప్రజాపక్షం / తిర్యాణి :** పిట్టగూడ గ్రామంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. తిర్యాణి మండలం మంగి గ్రామ పంచాయతీ పరిధిలోని ఈ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరుబావిని మంగళవారం ప్రారంభించారు. సర్పంచ్ రాయి సీడం వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మిషన్ భగీరథ ఎఇ నరేష్ సాంకేతిక పర్యవేక్షణలో, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ సమన్వయంతో బోరుబావి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీరు నిరంతరం అందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గ్రామ అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామని, ప్రజల సహకారంతో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. తమ సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఉప సర్పంచ్ కనక శ్రీకాంత్, గ్రామ పటేల్, మాడవి శ్రీనివాస్, రాయిసిడాం భుజంగారావు, వార్డు సభ్యుడు ఆడ రవీందర్ పాల్గొన్నారు.

## పిల్లల భవిష్యత్తుకు విద్యే ఆధారం

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** పిల్లల భవిష్యత్తును సుస్థిరంగా నిర్మించడంలో విద్య అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని ఎస్‌పిఎం ప్రతినిధి ఎంఎస్ గిరి పేర్కొన్నారు. కాగజ్ నగర్ మండలంలోని రెగులగూడ, ఊట్పల్లి గిరిజన గ్రామాలు, డాడానగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఎస్‌పిఎం సంస్థ ఆధ్వర్యంలో 90 పాఠశాల బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు బ్యాగుల పంపిణీ నిర్వహించామని, విద్యార్థుల విద్యాభ్యాసానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఈ తోడ్పాటునందించినట్లు వెల్లడించారు.

## క్రీడాకారులను అభినందించిన మండల ఎండిఓ



ప్రజాపక్షం / నందిపేట్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్న సిఎం కప్ క్రీడోత్సవాలలో నందిపేట్ మండల తరపున ఖోఖో పోటీల్లో రాష్ట్ర స్థాయిలో పాల్గొన్న క్రీడాకారిణి పోలపెల్లి నందిత, రామ్ సింగ్, జిల్లా స్థాయిలో ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో బంగారు పతకాలు సాధించిన రెంజర్ల శ్రీవల్లి, ఎర్రోల్ల శ్రుతజ్ఞ, జోగిని ప్రేమలతలను ఎండివో శ్రీనివాస్ రావు అభినందించారు. నందిపేట్ గ్రామ ఉపసర్పంచ్ వాసవి రాంచందర్, శ్రీ గీతా కాన్వెంట్ హై స్కూల్ కరస్పాండెంట్ కానూరి గంగాసాగర్, స్థానిక ఫిజికల్ డైరెక్టర్ నాంచారి శ్రీనివాస్, పిఈటి మర్రిపల్లి సుమలత, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో పాల్గొన్న పోలపల్లి నందితకు నందిపేట్ గ్రామ 9వ వార్డు సభ్యులు రెమ్మ రవి రూ. 5 వేలు నగదు పారితోషికాన్ని అందజేశారు.

## సిఎం రిలీఫ్.. ఫండ్ విడుదల



ప్రజాపక్షం / నందిపేట్ : నందిపేట్ మండలంలోని వెల్మల్ గ్రామానికి చెందిన ముగ్గురికి సిఎం రిలీఫ్ ఫండ్ విడుదల అయినట్టు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మంద మహిపాల్ తెలిపారు. గొజి ముత్తెమ్మకు రూ. 14 వేల 500, ముప్పెడ శ్రీనివాస్‌కు రూ. 12 వేల 500, ఉమ్మెడ గంగామణికి రూ. 18 వేలు చెక్కులు అందజేశారు.

# మంత్రి వివేక్‌పై దాడి ప్రజాస్వామ్య విరుద్ధం



ప్రజాపక్షం / మందమర్రి : క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్ పర్సన్ ఎన్నిక విషయంలో మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి వాహనంపై బిఆర్ఎస్ శ్రేణులు జరిపిన దాడిని మందమర్రి పట్టణ కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ బిఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని కొట్టిపారేశారు. చైర్‌పర్సన్ పదవి కోల్పోతామనే భయంతోనే క్యాతనపల్లి ఫ్లైఓవర్ వద్ద మంత్రి వాహనం, పోలీసుల వాహనాలపై, కాంగ్రెస్ కార్యకర్తలపై రాళ్లదాడికి పాల్పడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో హింసాత్మక చర్యలు సరికావని, మంత్రి స్థాయి నాయకుడిపై దాడి చేయడం అత్యంత దురదృష్టకరమని వారు పేర్కొన్నారు. బిఆర్ఎస్ వర్గంలోని ఇద్దరు కౌన్సిలర్లను మాజీ ఎంఎల్ఏ బాల్క సుమన్ బెదిరించి నిర్బంధించారని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నా బిఆర్ఎస్ గుండాయిజం కొనసాగిస్తోందని, ఇకపై మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు లేదా దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సోతుకు సుదర్శన్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పుల్లూరి లక్ష్మణ్, నాయకుడు పైడిమల్ల నర్సింగ్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలకు పటిష్ట పోలీసు బందోబస్తు

### జిల్లా ఎస్‌పి జానకి షర్మిల




ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నేటి నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు.పరీక్షలు ప్రశాంతంగా,పారదర్శకంగా,నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ తరపున విస్తృత స్థాయిలో భద్రతా చర్యలు చేపట్టనట్లు తెలిపారు.జిల్లాలో మొత్తం 23 పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు,పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో బిఎన్ఎస్ సెక్షన్ 163(144 సెక్షన్ పోతాది)అమలు చేయబడుతుందని తెలిపారు.అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా,ట్రాఫిక్ నియంత్రణ చర్యలు,ప్రశ్నాపత్రాల రవాణా,పరీక్ష అనంతరం సమాధాన పత్రాల భద్రత కోసం ప్రత్యేక ఎస్కార్ట్ ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.పరీక్షల ప్రారంభం నుండి ముగింపు వరకు నిరంతర పోలీసు పెట్రోలింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు.విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని,పరీక్షల సమయంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక బందోబస్తు కొనసాగుతుందని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు.

# చలో సెక్రటేరియట్ ఆర్టీసీ బస్సులు



ప్రజాపక్షం/నిర్మల్/బైంసా : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిర్మల్,బైంసా డిపోల నుండి భారీ సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్లారు.రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలని,కార్మికులకు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు పెద్ద ఎత్తున ఈ నిరసనలో పాల్గొన్నారు. ముఖ్యంగా ఆర్టీసీలో ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయడం ఆపాలని,సంస్థను కాపాడుకోవడానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు.పాత బస్సుల స్థానంలో కొత్త ఎలక్ట్రికల్ బస్సులను ప్రవేశపెట్టి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని,అలాగే సంస్థలో ఖాళీగా ఉన్న కండక్టర్,డ్రైవర్ పోస్టులను తక్షణమే భర్తీ చేసి నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని వార్డు విజ్ఞప్తి చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని,తక్షణమే పెండింగ్‌లో ఉన్న హామీలన్నింటినీ అమలు చేయాలని కార్మికులు స్పష్టం చేశారు. హక్కుల సాధన కోసం చేపట్టిన ఈ పోరాటంలో నిర్మల్ జిల్లా పరిధిలోని వివిధ డిపోల నుంచి కార్మికులు స్వచ్ఛందంగా తరలిరావడంతో బస్టాండ్ పరిసరాల్లో సందడి నెలకొంది.తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం ఆపే ప్రసక్తే లేదని,ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు.

# ధర్మపురి సంజయ్‌కి కాంగ్రెస్‌లో కీలక పదవి కేటాయించాలి

### గిపిసిసి చీఫ్‌కు మున్నూరుకాపు కులస్తుల వినతి

### గాంధీభవన్‌కు భారీగా తరలిన మున్నూరుకాపు ప్రతినిధులు

ప్రజాపక్షం/నిజామాబాద్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ నగర తొలి మేయర్, జిల్లా మున్నూరుకాపు అధ్యక్షులు ధర్మపురి సంజయ్‌కు కాంగ్రెస్ పార్టీలో కీలక పదవి కేటాయించాలని మున్నూరుకాపు కులానికి చెందిన ప్రతినిధులు గంగాధర్, బెల్దరి గోపి, ప్రసాద్, పుప్పాల రవి, రణధీర్ కోరారు. ఈ మేరకు జిల్లా నుండి పెద్ద ఎత్తున సోమవారం హైదరాబాద్ లోని గాంధీభవన్‌కు తరలివెళ్లారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అందుబాటులో లేకపోవటంతో గాంధీభవన్ ఇన్‌చార్జి టీపీసీసీ ఉపాధ్యక్షులు కుమార్ రావుకు వినతిపత్రం అందజేశారు. మహేష్‌కుమార్‌గౌడ్‌కు తమ ఆవేదనతో కూడిన వినతిపత్రం అందించాలని కోరారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాలో సుమారు 450000 మంది మున్నూరుకాపు ఓటర్లున్నారని గుర్తు చేశారు. గత 12 సంవత్సరాలుగా జిల్లాలో మాకు సరైన రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా పోయిందని పత్రంలో ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే బడుగు, బలహీన వర్గాల పార్టీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం ఉందని, జిల్లా సంఘానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మపురి శ్రీనివాస్ తనయుడికి కీలక పదవి ఇవ్వాలని కోరారు. పార్టీలకతీతంగా మున్నూరుకాపు సోదరులందరం సోదరమనులందరూ ఏకమై మేము మీకు విన్నవించుకున్నది ఏమనగా మా జిల్లా అధ్యక్షుడు ధర్మపురి సంజయ్‌కి మీరు ఏదైనా గౌరవప్రదమైన పదవి ఇచ్చి మున్నూరుకాపుల అభ్యున్నతికి నాంది పలకాలన్నారు. మా సంజయ్ గతంలో మేయర్‌గా పని చేశారని ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో క్రియాశీలకంగా నిజామాబాద్ కార్పోరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేలా పని చేశారని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ మున్నూరుకాపులకు ఇచ్చిన ప్రాతినిధ్యాన్ని ఎన్నటికీ మరిచిపోమని మున్నూరు కాపు సోదరీమనులందరం ఏకగ్రీవంగా కోరుకుంటున్నామన్నారు. మున్నూరుకాపు సోదరులు అందరం కూడా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడుతామని మా అందరికి నాయకత్వం వహిస్తున్న మాజీ మేయర్ ధర్మపురి సంజయ్‌కి కాంగ్రెస్ పార్టీలో కీలక పదవి అప్పగించి మున్నూరుకాపులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జిల్లా నుండి గాంధీభవన్‌కు తరలివెళ్లిన వారిలో మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు కార్యకర్తలున్నారు.

### ఆర్టీసీ చైర్మన్ పదవి ఖాయమా ?

మున్నూరుకాపులకు జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన ధర్మపురి సంజయ్‌కు ఆర్టీసీ చైర్మన్ పదవి ఖాయమైందని జిల్లాలో ఊహాగానాలు వినిపించాయి. తర్వాత మరోక కీలక పదవి ఇవ్వనున్నట్లు జిల్లాలో చర్చ కొనసాగింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడిగా మున్నూరు కాపు రథసారథిగా వ్యవహరిస్తున్న ధర్మపురి సంజయ్‌కు తప్పకుండా కీలక పదవి వస్తుందని వెంటనే పదవి ఇవ్వాలని మున్నూరుకాపు ముఖ్య నేతలు హైదరాబాద్ వెళ్లటం గమనార్హం. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పదవి ఇవ్వనున్నట్లు సమాచారం.

# పకడ్బందీగా ఇంటర్,పది పరీక్షలు

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ఇంటర్మీడియట్,పదవ తరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు,హైదరాబాద్ నుంచి,ఇంటర్మీడియట్,పదతరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలిసి,అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ..ఎస్ఎస్‌సి,ఇంటర్ పరీక్షలను ప్రశాంతంగా పూర్తి చేయాలన్నారు.పరీక్షల నిర్వహణపై పలు అంశాలను చర్చించారు.పరీక్షల నిర్వహణపై వివరాలను జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ,ఇంటర్మీడియట్,పదవతరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఇంటర్మీడియట్ కు సంబంధించి జిల్లాల్లో మొత్తం నేటి నుంచి,మార్చి 18 వరకు,6652 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు,6473 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు,మొత్తం కలిపి 13125 విద్యార్థులు,23 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారని అన్నారు.పదవ తరగతి పరీక్షలకు సంబంధించి మార్చి 14వ తేదీ నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు ఉదయం 9.30 నుండి 12.30 వరకు,47 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 9758 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు.పరీక్ష కేంద్రాల వద్ద,పరీక్షా పత్రాల తరలింపు సమయంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అన్ని పరీక్షా కేంద్రాలలో త్రాగునీరు,విద్యార్థులకు సౌకర్యవంతమైన బెంచీలు,సరైన లైటింగ్,సిబ్బందితో కూడిన వైద్య శిబిరం,తదితర అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు.పరీక్షలు జరుగుతున్నంతసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని వివరించారు.పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ దుకాణాలు మూసివేసి,బిఎన్ఎస్ సెక్షన్ 163(సీఆర్పీసీ 144) అమలు చేయాలని అన్నారు.ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా,పారదర్శకంగా పరీక్షలను పూర్తి చేయాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,ఆర్డీఓ రత్న కళ్యాణి,డీఈవో భోజన్న,డిఐఈఓ పరుశురాం,డిపివో శ్రీనివాస్,ఖజానా శాఖ అధికారి సరోజ,డిఎంహెచ్ఓ రాజేందర్, రవాణా శాఖ అధికారి దుర్గా ప్రసాద్,ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు..

ప్రజాపక్షం/బోథ్ : వేసవి కాలం దృశ్య ప్రయాణికులకు వివిధ అవసరాల రిత్యా బయటికొచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు మీర్ ఇర్షాద్ అలీ చలివేంద్రాన్ని మంగళవారం బోథ్ లో అంబేద్కర్ విగ్రహం దగ్గర ఏర్పాటు చేయడం జరిగింది.ప్రతి సంవత్సరం చలివేంద్రం ఏర్పడి చేయడం వల్ల ప్రజలు ఇర్షదును అభినందించారు.ఈ కార్యక్రమంలో తన మిత్రులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్ అటవీ ప్రాంతం నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు మంగళవారం కన్సర్వ్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. కోనాపూర్ వాసంగట్టు తండాకు చెందిన లకావత్ రాజేందర్ చౌటపల్లికి ఇసుక రవాణా చేస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు అటవీ అధికారులు ట్రాక్టర్‌ను పట్టుకుని స్వాధీనం చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను కమ్మర్‌పల్లి అటవీ రేంజ్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో ఉంచి అతనిపై కేసు నమోదు చేసినట్లు కన్సర్వ్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్ తెలిపారు. ఇలాంటి అడవి ప్రాంతం నుండి అక్రమ ఇసుక, కట్టెలు రవాణాకు పాల్పడితే వారిపై తీవ్రమైన చర్యలు తీసుకుంటామని సూచించారు.



## శిలాఫలకం ఎక్కిన ప్రకటన




**ప్రజాపక్షం/సారంగాపూర్ :** విద్యార్థులను ఆకర్షించి సొమ్ము చేసుకోవాలనే ఆలోచనలో ప్రకటన పత్రాలు అతికించడానికి శిలాఫలకాలని కూడా చూడట్లేదు ప్రైవేట్ కోచింగ్ సెంటర్ యాజమాన్యాలు.మండల కేంద్రంలో అడెల్లి ఆలయానికి వెళ్లే రహదారిపై ఉన్నటువంటి స్వాగత తోరణానికి ఉన్నటు వంటి శిలాఫలకంపై మంగళవారం ఓ ప్రైవేట్ కోచింగ్ సెంటర్ ప్రకటన పత్రాలు దర్శనమిచ్చాయి.దీంతో అటువైపు వెళ్లే ప్రయాణికులు భక్తులు చూసి ఆశ్చర్యానికి గురయ్యారు.అనంతరం కోచింగ్ సెంటర్ నిర్వాహకులకు సమాచారం ఏల్లడంతో తమ సిబ్బందితో తొలగింపజేశారు.

## అక్రమ ఇసుక పట్టివేత



**ప్రజాపక్షం/తానూర్ :.** మహారాష్ట్ర నుండి అక్రమంగా తెలంగాణలో హైవ బండిలో ఎటువంటి అనుమతులు పత్రాలు లేకుండా తరలిస్తున్న ఇసుకను రెవెన్యూ ఆర్ఐ సాయికిరణ్,జిపిఓ నరేష్ మంగళవారం పట్టుకున్నారు.మహారాష్ట్ర ధర్మబాద్ నుండి తానూర్ మీదుగా కోలూర్ వెళ్తున్న ఇసుక బండి తరలిస్తున్నారని రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందడంతో ముందుగానే కోలూర్ రోడ్డు పై కాపు కాసిన రెవెన్యూ సిబ్బంది అ ఇసుక బండి పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమ ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్ఐ సాయికిరణ్ హెచ్చరించారు.

## క్షేత్ర పరిశీలనతో చదువులో విద్యార్థుల పురోగతి

**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** పాఠ్యపుస్తకాల్లో ఉన్న అంశాలను స్వయం పరిశీలనతో విషయ అవగాహన చేసుకునే విద్యార్థులు చదువులో ముందంజలో ఉంటారని ఖానాపూర్ మండలం మస్కాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్ అన్నారు.మంగళవారం 6వ తరగతి తెలుగు పాఠ్యాంశంలోని చెరువు అనే పాఠంలోని అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు విద్యార్థులతో కలిసి,ప్రధానోపాధ్యాయులు,తెలుగు ఉపాధ్యాయులు వెన్నం అంజయ్య ఆ గ్రామంలోని చెరువును సందర్శించారు.ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పుస్తకాల్లోని భావనలను విద్యార్థులు అర్థం చేసుకోవాలన్నారు.చెరువులతోనే భూగర్భ జలాలు పెరుగుతాయని,చెరువు నీటిని పరిరక్షిస్తే రానున్న వేసవిలో పశు పక్ష్యాదులక దాహం తీరుతుందన్నారు.ప్లాస్టిక్ తదితర వ్యర్థాల నుండి చెరువును కాపాడుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా చెరువు ప్రాధాన్యత చిత్రాలను గీసిన విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నామాల సురేష్ ,రాజేందర్ రెడ్డి,స్వప్న,బి.రవి కుమార్,షేక్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

# నేటి నుండే ఇంటర్ పరీక్షల సందడి

### ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పగడ్బందీ ఏర్పాట్లు

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటి నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రారంభం కానున్నాయి.ఈ విద్యా సంవత్సరం పరీక్షలను అత్యంత పారదర్శకంగా,పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ (సిఎస్) కృష్ణ తెలిపారు.బుధవారం జరిగే మొదటి పరీక్షకు మొత్తం 272 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో 190 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

### జనరల్ విద్యార్థులకు..

**ద్వితీయ భాష(తెలుగు,హిందీ) వొకేషనల్ విద్యార్థులకు :** జనరల్ ఫౌండేషన్ కోర్సు జరగనున్నాయి.ఈ సారి పరీక్షల నిర్వహణలో సాంకేతికతకు పెద్దపీట వేశారు.ప్రతి పరీక్ష గదిలోనూ,కళాశాల ప్రాంగణంలోనూ సీసీ కెమెరాలను అమర్చారు.ఈ కమెరాల దృశ్యాలను ఇంటర్ బోర్డు ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి ప్రత్య



క్షంగా పర్యవేక్షించనున్నారు.పరీక్షల పర్యవేక్షణ బాధ్యతలను డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా నియమితులైన యు సురేఖ స్వయంగా పర్యవేక్షిస్తారు.సీఎస్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి..హాల్ టికెట్ నంబర్ ప్రకారం కేటాయించిన సీట్లలోనే కూర్చోవాలి.మొబైల్ ఫోన్లు,స్మార్ట్ వాచ్‌లు లేదా ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి తీసుకురాకూడదు.విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా త్రాగు నీరు,మెరుగైన లైటింగ్,మరుగుదొడ్ల సౌకర్యాలను సిద్ధం చేయడం జరిగింది.విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనవ్వకుండా,ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.

# కాంగ్రెస్ అరాచకాలను ఎండగడతాం

### మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజం

**ప్రజాపక్షం/సోన్ :** హైదరాబాద్ నుండి ఆదిలాబాద్ వెళ్తున్న బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు సోన్ మండలం లోని కడ్తల్ టోల్ ప్లాజా వద్ద బిఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు.నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామ్ కిషన్ రెడ్డి,జాన్సన్ నాయక్,మాజీ కౌన్సిలర్ రాజేందర్ రాథోడ్ అశోక్,జాన్ సత్య తదితరులు కేటీఆర్‌ను శాలువా,పూల మాలలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..ఇటీవల జరిగిన గొడవల్లో బిఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ అరెస్టును తీవ్రంగా ఖండించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తమ సొంత పార్టీ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని మండిపడ్డారు.రానున్న రోజుల్లో బిఆర్ఎస్ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ అరాచకాలను బయటపెడతతామని ఆయన హెచ్చరించారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు.మహిళలకు తులం బంగారం,రైతులకు రుణమాఫీ,నిరుద్యోగులకు ఉద్యోగాలు,ఇల్లు లేని పేదలకు ఇళ్లు ఇస్తామని అజెండాలో రాసి గెలిచిన తర్వాత



మాట మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.పెంచిన పింఛన్లను వెంటనే విడుదల చేయాలని,కొత్త పింఛన్లను మంజూరు చేయడంతో పాటు రైతులకు రుణమాఫీని తక్షణమే అందజేయాలని కోరారు.ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.ఈ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చించోలి-బి మహిళా ప్రాంగణంలో ఉద్యం నమోదు అవగాహన

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** సారంగాపూర్ మండలం లోని చించోలి (బి) గ్రామం మహిళా ప్రాంగణంలో ఉద్యం నమోదు అవగాహన కార్యక్రమం కింద,ఆర్ఏఎంప్ పథకం ద్వారా ఎంఎస్ఎంఈఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెంటర్(ఇడిసి) ఆధ్వర్యంలో చించోలి బి గ్రామం లోని మహిళా ప్రాంగణంలో ఉద్యం నమోదు () పై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహ రెడ్డి,ఎల్డీం రామ్ గోపాల్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆశావహ వ్యాపారవేత్తల కోసం నిర్వహించబడింది.ఇందులో ఉద్యం నమోదు ద్వారా లభించే ప్రయోజనాలు,ప్రాధాన్యత గురించి అధికారులు వివరించారు.ముఖ్యంగా సులభంగా బ్యాంకు రుణాలు పొందడం,విద్యుత్,పన్నులపై సబ్సిడీలు,ప్రభుత్వ సబ్సిడీలు,వివిధ పథకాల ప్రయోజనాలు గురించి అవగాహన కల్పించారు. హాజరైన అధికారులు జిల్లా పరిశ్రమల కేంద్రం(డిఐసి) వివిధ ప్రభుత్వ పథకాలైన పీఎంఈజీపీ ,పీఎంఎంవై,పీఎం విశ్వకర్మ,టిప్రైడ్,డిఈ




ఈటీ పథకాల గురించి వివరించి,వాటి ద్వారా వ్యాపారవేత్తలకు లభించే ప్రయోజనాలను తెలియజేశారు.బ్యాంకు రుణాల ప్రక్రియపై వివరించి,వ్యాపారవేత్తలు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం ఎలా పొందాలో మార్గనిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో టి.ఎస్. డబ్ల్యూ. సి.డి.సి జిల్లా మేనేజర్ విజయలక్ష్మి ,సౌమ్య,శ్రీ రమేష్ (ఈ.టి.ఎం.ఎం) వనరుల వ్యక్తిగా పాల్గొని, శిక్షణ,నైపుణ్యాభివృద్ధి,ఉపాధి ప్రధాన కార్యక్రమాలపై సమాచారం అందించారు.

## సిసి రోడ్డు పనులు పరిశీలించిన కౌన్సిలర్ రాజురా సత్యం

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** నూతనంగా వేస్తునా సీసీ రోడ్డు,డ్రైనేజ్ పనులను పరిశీలించిన 11వ వార్డ్ కౌన్సిలర్,మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం.ఖానాపూర్ పట్టణం జెకె నగర్,విద్యానగర్ ,కాలనీలలో జరుగుతున్న నూతన సీసి రోడ్లు,డ్రైనేజీ పనులను ఖానాపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు పరిశీలించినట్లు రాజురా సత్యం తెలిపారు.తను మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా 11వ వార్డులో నూతన సీసీ రోడ్డు లు అదే విధంగా నూతన డ్రైనేజీలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణల అభివృద్ధికి ఎంతో తొడ్పాడుతుందని అన్నారు.



## రైతులకు అపార నష్టం కలిగించిన వడగళ్ల వాన

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలం వ్యాప్తంగా సోమవారం రోజున సాయంత్రం కురిసిన గాలివాన బీభత్సం తో రైతులకు అపార నష్టం కలిగించింది.మండలంలోని పలువురు రైతులు రాత్రి కురిసిన వర్షానికి మొక్కజొన్న పంట అడ్డంగా పడిపోయిందని రైతులకు తీవ్ర నష్టం కలిగించిందని ప్రభుత్వం అధికారులు నాయకులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని తెలిపారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి..

**ప్రజాపక్షం/తానూర్ :** తానూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో సోమవారం సాయంత్రం కురిసిన అకాల వర్షం,గాలి కారణంగా చేతికొచ్చే,దిశలో ఉన్న మొక్కజొన్న,శనగ పంటలు, తీవ్రంగా దెబ్బ తినడంతో..మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఈ మేరకు వినతి పత్రం పంపారు.గత మూడు నెలలు కష్టపడి సాగుచేసిన మొక్కజొన్న,శనగ పంటలు,మరో 15 రోజులో చేతుకొచ్చి,సమయం లో వర్షార్పణం కావడంతో రైతులు కొలుకోలేని స్థితిలో ఉన్నారని వివరించారు.నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందేలా చూడాలని మంత్రిని కోరారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం

**ప్రజాపక్షం/తానూర్ :** తానూర్ మండలంలోని ఎల్వత్, వాడోన, కొలూర్ గ్రామాల్లో మంగళవారం మహిళా సమాఖ్య సంఘ భవనాల నిర్మాణానికి ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.అనంతరం ఎల్వత్ గ్రామంలో రూ.2 లక్షల నిధులతో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మహిళలు ఆర్థికంగా,సామాజికంగా అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు.గ్రామాల సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని,విద్యా,మహిళా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. బిజెపి మండల అధ్యక్షుడు లక్ష్మణ్ రెడ్డి,ఆయా గ్రామాల సర్పంచులు,మండల నాయకులు,ప్రజాప్రతినిధులు,అధికారులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

## లక్ష్మీనారాయణ స్వామి అన్నదానానికి విరాళం

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలం బాగాపూర్ శివారులో గల రాజ్యలక్ష్మి సహితా లక్ష్మీ నారయణ స్వామి ఆలయంలో నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఫిబ్రవరి 28 మార్చి 1,2వ తేదీలలో నిర్వహించబడును.మార్చి 2వ తేదీన శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి కల్యాణ మహోత్సవాము భక్తి శ్రద్ధలతో నిర్వహించబడనున్నాయి.ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ దేవేంద్రరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేయడం జరిగింది.దేవేందర్ రెడ్డి డాక్టర్ సానుకూలంగా స్పందించి,02/03/2026 తేదీన నిర్వహించనున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం కొరకు రూ. 1,05,000/ (ఒకప లక్ష ఐదు వేల రూపాయలు) విరాళంగా అందజేశారు.అలాగే ఆ రోజు హాజరవుతానని తెలిపారు.వారి దాతృత్వానికి,సేవాభావానికి దేవాలయ కమిటీ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయ కమిటీ సభ్యులు,పొద్దుటూరి శ్రీనివాస్ రెడ్డి,పొద్దుటూరి కృష్ణారెడ్డి,సర్పంచ్ ముత్యాల శ్రీవేదా ప్రణీత్ రెడ్డి,భూత గంగాధర్ బొంబాయి భోజన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతాంగానికి అన్యాయం..

### బైంసా మండల బిజెపి అధ్యక్షురాలు సుష్మరెడ్డి..

**ప్రజాపక్షం/బైంసా :** రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతాంగానికి తీరని అన్యాయం జరుగుతుందని దేగాం సర్పంచ్ బైంసా మండల బిజెపి అధ్యక్షురాలు సిరం సుష్మరెడ్డి అన్నారు.మంగళవారం దేగాం గ్రామంలో నష్టపోయిన మొక్కజొన్న పంటను పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు.రాష్ట్రం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన ను అమలు చేస్తే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు.ఇకనైనా సర్కార్ ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని డిమాండ్ చేశారు.తక్షణమే సర్వే చేపట్టి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.ఫసల్ బీమా తో మహారాష్ట్రలో ఎకరానికి 30 నుంచి 50 వేల రూపాయల వరకు నష్టపరిహారం వచ్చిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు.

# జాతీయ స్థాయిలో మెరిసిన రుద్రూర్ మోడల్ స్కూల్ విద్యార్థినులు

### ఇంట్రోస్పెక్షన్ కవితా సంకలనంలో చోటు



**ప్రజాపక్షం/బోధన్:** నిజామాబాద్ జిల్లా తెలంగాణ మోడల్ స్కూల్ అంబం(రుద్రూర్) విద్యార్థినులు జాతీయ స్థాయిలో తమ కవితా ప్రతిభను చాటారు. ఢిల్లీకి చెందిన ప్రముఖ ప్రచురణ సంస్థ జెటిఎన్ పబ్లికేషన్ ప్రచురించిన ఇంట్రోస్పెక్షన్(మిర్రర్స్ఆఫ్ ద మైండ్) అనే జాతీయ స్థాయి కవితా సంకలనంలో ఈ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినుల కవితలు ప్రచురితమయ్యాయి. ఈ ఘనత సాధించిన బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దర్కట్ల రక్షిత, తంబీలా రహీస్ తో పాటు 9వ తరగతి విద్యార్థిని తాటి కొండ ప్రియా నందిని అనే విద్యార్థినులను బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో లు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థినులను సదరు కవితా సంకలన పుస్తకాలను బహుకరించి వారి సృజనాత్మకతను కొనియాడారని ప్రిన్సిపల్ రాఘవేందర్ తెలిపారు. పోచారం శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థినులు జాతీయ స్థాయి కవితా సంకలనంలో చోటు సంపాదించడం గర్వకారణమని, ఇది మిగతా విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. చిన్న వయస్సులోనే సామాజిక అంశాలపై, మనోభావాలపై కవితలు రాసి జాతీయ గుర్తింపు పొందిన ఈ విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, స్థానికులు అభినందించారు.

# పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / నస్పూర్ :** జిల్లాలో పదవ తరగతి వార్షిక పరీక్షలను ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్యతో కలిసి మండల విద్యాధికారులు, పరీక్షా పర్యవేక్షకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు జరిగే ఈ పరీక్షల కోసం జిల్లాలో 48 కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొత్తం 9,703 మంది రెగ్యులర్ విద్యార్థులతో పాటు 45 మంది గతంలో అనుత్తీర్ణులైన వారు పరీక్షలకు హాజరుకానున్నారని వివరించారు. పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామని, పోలీస్ స్టేషన్ల నుండి కేంద్రాలకు ప్రశ్నపత్రాల తరలింపులో జాగ్రత్తలు వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో మొబైల్ ఫోన్లను కచ్చితంగా నిషేధించాలని, విద్యార్థులను లోనికి పంపే ముందు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, మాల్ ప్రాక్టీస్ వంటి వార్తలు వస్తే కఠిన చర్యలు ఉంటాయని, కేంద్రాల్లో తాగునీరు, వెలుతురు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రూట్ అధికారులు, పరీక్షా కేంద్రాల ముఖ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

### జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** 202526 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు నేటి బుధవారం నుండి నిర్వహించడానికి జిల్లాలో సర్వం సిద్ధం చేసినట్టు జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపుడి రవికుమార్ అన్నారు. జిల్లాలో 58 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడం జరిగిందన్నారు. ప్రశ్న పత్రాలను ఆయా పరీక్షా కేంద్రాల సమీపంలోని పోలీసు స్టేషన్‌లలో భద్రపరచడం జరిగిందన్నారు. కాపీ నిరోధించడానికి గాను సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మాస్ కాపీయింగ్ నివారణకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు తో పాటు జిల్లా హైపవర్ కమిటి, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటి అధికారులు, నిరంతరం పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయడంతోపాటు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తామన్నారు. జిల్లాలో మొత్తం 39 వేల 963 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్నారని, వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 19 వేల 299 కాగా, రెండవ సంవత్సరం విద్యార్థులు 17 వేల 664 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, వీరిలో జనరల్ విద్యార్థులు మొదటి సంవత్సరం 16 వేల 336, ఒకేషనల్ 2 వేల 963 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. అలాగే రెండవ సంవత్సరం విద్యార్తుల్లో 14 వేల 893 మంది జనరల్ విద్యార్థులు కాగా, 2 వేల 771 మంది విద్యార్తులు ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. విద్యార్తులకు హాల్ టికెట్లు జారీచేయడంలో ప్రయివేటు కళాశాలల ప్రిన్సిపాల్ సిబ్బంది ఇబ్బందులకు గురిచేసినట్లయితే నేరుగా ఇంటర్‌నెట్ నుండి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని హాజరు కావచ్చునన్నారు. ఈ హాల్ టికెట్‌పై ప్రిన్సిపల్ సంతకం అవసరం లేదని స్పష్టం చేశారు. పరీక్ష సమయాలకు అనుగుణంగా ఆర్‌టిసి అధికారులు బస్సులు నడపనున్నారన్నారు. విద్యార్తులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలని, అలాగే పరీక్ష కేంద్రాలలో నిరంతరం విద్యుత్ సరఫరా కొనసాగేలా చర్యలు తీసుకున్నారన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్సు సెంటర్లను మూసివేయాలని విద్యార్థులు ఎలాంటి ఒత్తిల్లకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విదంగా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.



# ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష

**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిస్తున్న బోధన్‌లోని గాంధీనగర్ కాలనీకి చెందిన షేక్ షబ్బీర్‌కు బోధన్ పోలీసులు స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేష తల్ప సాయి ముందు హాజరు పరచగా షేక్ షబ్బీర్‌కు ఐదు రోజుల జైలు శిక్ష విధించడం జరిగింది. మద్యం తాగి వాహనాలు నడపరాదని, ప్రమాదాలకు గురి కావద్దని, తాగి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని బోధన్ పట్టణ సిఐ వెంకట్ నారాయణ హెచ్చరించారు.

# ఘనంగా ప్రారంభమైన నల్లపోచమ్మ విగ్రహ పునఃప్రతిష్టాపన

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి (నల్ల పోచమ్మ) అమ్మవారి ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్టాపన మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవాలు 24 నుంచి ప్రారంభమై 26 గురువారం వరకు నిర్వమించబడనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, అలంకరణలు నిర్వహించబడతాయని ఫిబ్రవరి 26న విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీర్వాదాలు పొందాలని ఆలయ నిర్వహకులు కోరారు. మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.



# పసిపాపను చంపిన దుండగులను శిక్షించండి

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో ఆధిపత్య సామాజిక వర్గం దాడిలో ప్రాణాలు కోల్పోయిన రెండు నెలల పాప మౌనిక చిత్రపటానికి నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో రజక సంఘం బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు, డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి పసికందు మృతికి కారకులైన ఆధిపత్య సామాజిక వర్గ దుండగులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

# గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం

**ప్రజాపక్షం/ఎడపల్లి:** గ్రామీణాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని టిఓటి క్యాతప్ప, ఎంపీడీవో శంకర్ లు అన్నారు. నూతనంగా ఎన్నికైన 14జీపీల వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని మంగలవారం ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేధికలో ప్రారంభించారు. ఈ సందర్భంగా టిఓపి, ఎంపిడిఓ లు మాట్లాడుతూ.. వార్డు సభ్యులకు పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకమైన బాధ్యతలు కట్టబెట్టిందన్నారు. వార్డులో సమస్యలు గుర్తించి పరిష్కరించడంలో చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరేలా కృషి చేయాలన్నారు. వార్డు సభ్యులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎడపల్లి మండలంలో 17జీపీలలో 166మంది వార్డు సభ్యులకు గాను మొదటి విడతలో మంగళవారం 9జీపీలకు సంబంధించిన 84మంది వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం చేపట్టడం జరిగిందని, మిగతా వారికి శిక్షణ ఉంటుందన్నారు. ఎంపీఓ మన్మోహన్ శాస్త్రీ, టిఓటిలు శ్రీనివాస్, ఈశ్వర్, రామకృష్ణయ్య తో పాటు పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం:బూడిద జ్యోతి

**ప్రజాపక్షం/జనగామ:** జనగామలోని మున్సిపల్ కార్మికులు, డ్రైవర్లు, శానిటేషన్ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని మూడో వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్మికులు మూడో వార్డు కౌన్సిలర్‌గా గెలుపొంది జ్యోతిగోపిని రైల్వేస్టేషన్ వద్ద సన్మాణించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బూడిద జ్యోతి మాట్లాడుతూ జనగామ పట్టణం విస్తరిస్తుందని, పెరిగిన జనాభాకు అనుకూలంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. మున్సిపల్ కార్మికుల సంఖ్యను పెంచకపోగా వారిపై పనిభారం మోపి ఇబ్బందులు పెట్టడం సరియైంది కాదన్నారు. జనగామ పట్టణంలో తీవ్రంగా పారిశుద్య సమస్య ఉందని, తక్షణమే మున్సిపల్ సిబ్బందిని పెంచాలన్నారు. మున్సిపల్ కార్మికులు మౌళిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనీస వేతన సమస్యతో పాటు ఉద్యోగ భద్రత లేదన్నారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుంచు విజేందర్, పెద్దగళ్ల సుధాకర్, మసి రాజు బొట్ల నాగరాజు, ఎల్లేష్, తిరుమల, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

### ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్

**ప్రజాపక్షం/రాయపర్తి:** దుర్గమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని జేతురాం తండా గ్రామ పంచాయతీ పరిధిలోని విద్యానగర్ తండాలో నిర్వహించిన దుర్గమ్మతల్లి పండగ వేడుకలో మంగళవారం ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్మాత్మిక చింతనను అలవర్చుకోవాలని అన్నారు. ఆధ్మాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాష్ట్ర ఎస్‌టి యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్, మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపల్లి సంతోష్ గౌడ్, లేతాకుల రంగారెడ్డి, గజవెల్లి ప్రసాద్, ఐత రాంచందర్, ఎండి యూసఫ్, కోలా సంపత్, ల్యాదేళ్ల ప్రశాంత్, నేతావత్ శ్రీధర్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.